సాక్షి
పార్వతీపురం మన్యం

గురువారం । 26 । డిసెంబర్ । 2024




టిడ్కో ఇళ్లకు గ్రహణం - 8లో

గత ప్రభుత్వం 95 శాతం నిర్మించిన టిడ్కో ఇళ్లకు గ్రహణం పట్టింది. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఇళ్ల పంపిణీ నిలిచిపోయింది.



మక్కువకు ప్రయాణం సాహసమే

సాలూరు నుంచి బాగువలస మీదుగా మక్కువకు ప్రయాణమంటే ప్రజల గుండెల్లో గుబులు రేగుతోంది. - 8లో



నారాయణ..నారాయణ..!

18,807 ఎకరాలకు సాగునీటి ఆధారమైన నారాయణపురం ఆనకట్ట శిథిలావస్థకు చేరడం రైతులను కలవరపెడుతోంది. - 8లో

న్యూస్‌రీల్

గురువుల వినూత్న నిరసన



ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలియజేస్తున్న గురువులు

సీతంపేట: సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంపై గిరిజన గురుకులాల్లో అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆందోళన వ్యక్తంచేశారు. సీతంపేట ఐటీడీఏ ముఖద్వారం వద్ద ఉన్న అడవితల్లి విగ్రహం ముందు బుధవారం జోరువానలో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. 36 రోజులుగా నిరసన దీక్షలు చేపట్టి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి న్యాయం చేయాలని కోరారు. డీఎస్సీలో తమ పోస్టులు మినహాయించి సీఆర్‌టీగా మార్పు చేయాలని, 2022 పీఆర్సీ ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.గణేష్, ఎస్.మోహన్‌రావు, కె.భవాని తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారంలో కూటమి నిర్లక్ష్యం


- నేటి నుంచి ధర్నాలు



కరపత్రాలను విడుదల చేస్తున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

సాలూరు: పురపాలక సంఘం, కార్పొరేషన్లలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు రాముడు, రవి, లక్ష్మి, బుజ్జి తదితరులు ఆరోపించారు. సాలూరులో వారు బుధవారం మాట్లాడుతూ గత సమ్మెలో ఇచ్చిన హామీలను ఇప్పటికీ అమలుచేయలేదన్నారు. ఒప్పందాలను ప్రభుత్వం ఉల్లంఘిస్తోందని విమర్శించారు. కాంట్రాక్టు కార్మికుల సర్వీసును క్రమబద్ధీకరిస్తామని మంత్రి లోకేశ్, ఇతర మంత్రులు ఎన్నికల ముందు ప్రకటించారని, ఆ హామీను నెరవేర్చాలని గురువారం నుంచి ధర్నాలు చేస్తామన్నారు. యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు సమ్మె ముగింపు రోజైన వచ్చే ఏడాది జనవరి 11న చేపట్టే నిరాహార దీక్షల్లో జిల్లాలోని కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు కరపత్రాలను ఆవిష్కరించారు.

నిలకడగా 'తోటపల్లి'



తోటపల్లి ప్రాజెక్టు వద్ద పరిస్థితి

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టు నీటి ప్రవాహం నిలకడగా ఉంది. నాగావళి నదిలో తోటపల్లి ప్రాజెక్టు వద్ద బుధవారం సాయంత్రానికి 105 మీటర్లకు 104.49 మీటర్ల మేర నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం నదిపై భాగం నుంచి ప్రాజెక్టుకు 410 క్యూసెక్కుల నీరు రాగా అధికారులు ఒక గేటును ఎత్తివేసి 695 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. ప్రాజెక్టు నీటిసామర్థ్యం 2.5 టీఎంసీలకు, 2.210 టీఎంసీలు ఉందని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు వద్ద నీటిపరిస్థితిని ఇంజినీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.



- భూ రిజిస్ట్రేషన్ విలువల సవరణ
- భారీగా పెంపునకు ప్రతిపాదనలు
- జనవరి ఒకటి నుంచి అమల్లోకి కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు!

రిజిస్ట్రేషన్ చార్జీల పెంపునకు కసరత్తు

వచ్చేనెల ఒకటో తేదీ నుంచి పెంపునకు కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే ఇది అమల్లోకి రానున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఫలితంగా కొనుగోలుదారుల నుంచి రిజిస్ట్రేషన్ ఫీజుల, స్టాంప్ డ్యూటీల రూపంలో భారీగా ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే రియల్ ఎస్టేట్ రంగం కొద్ది నెలలుగా సంక్షోభంలో ఉంది. భూముల క్రయ విక్రయాలు పూర్తిగా మందగించాయి. వాస్తవానికి కరోనా తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. జిల్లాలో 2021–22లో రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ లక్ష్యం రూ.57.28 కోట్లు కాగా.. రూ.42.77 కోట్లు.. 2022–23లో లక్ష్యం రూ.55.44 కోట్లు కాగా.. రూ.48.80 కోట్లు వరకే చేరుకోగలిగింది. ప్రస్తుత సంవత్సరంలో లక్ష్యం రూ.38.23 కోట్లు కాగా.. ఆ మొత్తానికీ చేరుకోలేకపోవడం గమనార్హం. ఈ సమయంలో భూముల విలువ పెంచడం వల్ల రిజిస్ట్రేషన్ చార్జీలు భారంగా మారనున్నాయి. ఈ స్థాయిలో రిజిస్ట్రేషన్ చార్జీలు పెరిగితే భూములు, స్థలాలు కొనుగోలు చేసే వారు మరింత వెనకడుగు వేస్తారని రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెబుతున్నారు.

సర్కారు వారి నూతన సంవత్సర కానుక.. భూ బాదుడు!

సాక్షి, పార్వతీపురం మన్యం: కూటమి సర్కారు కొత్త సంవత్సర కానుకగా భూముల రిజిస్ట్రేషన్ చార్జీల పేరుతో బాదుడుకు రంగం సిద్ధం చేసింది. భూముల కొత్త రిజిస్ట్రేషన్ విలువలు జనవరి ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ.. ఇప్పటికే ఇందుకు సంబంధించిన కసరత్తును అధికార యంత్రాంగం పూర్తి చేసింది. ఏ ప్రాంతంలో ఎంత పెంచాలన్న దానిపై కొద్దిరోజుల కిందటే జిల్లాస్థాయి కమిటీ సమావేశమైంది. జిల్లాలోని నాలుగు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో.. ఆయా ప్రాంతాల్లో భూమికి ఉన్న డిమాండు, అభివృద్ధికి అవకాశం ఉన్న ప్రాంతాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణాలు, పల్లెల్లో ఒకేసారి అమలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఆయా ప్రాంతాల్లో మార్కెట్ వాల్యూను బట్టి సవరణకు ప్రతిపాదనలు చేశారు. స్థలం, వ్యవసాయ భూమి (పల్లం/మెట్ట వేర్వేరుగా), తోటలుగా పరిగణనలోకి తీసుకున్నారు.

స్థానికుల నుంచి వ్యతిరేకత

ఇప్పటికే ప్రతిపాదనల జాబితాలను కార్యాలయాల వద్ద ప్రదర్శించగా.. స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పార్వతీపురం మండలంలోని నర్సిపురం గ్రామ రెవెన్యూలో భూముల రిజిస్ట్రేషన్ బహిరంగ మార్కెట్ విలువ కంటే రెండు రెట్లు అధికంగా పెంచుతున్నారని.. తద్వారా రిజిస్ట్రేషన్‌కు అధిక మొత్తంలో స్టాంపు డ్యూటీ చెల్లించివలసి వస్తుందని స్థానికులు చెబుతున్నారు. రైతులకు ఇది తలకు మించిన భారంగా మారుతున్నందున మార్కెట్ ధర పెంచుకుండా చర్యలు తీసుకోవాలని గత సోమవారం కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌లో వినతిపత్రం అందజేశారు.



ఎక్కడెక్కడ ఎంతంటే?

- పార్వతీపురం పరిధిలో భూముల రిజిస్ట్రేషన్ విలువ అమాంతం పెరగనుంది. జిల్లా కేంద్రం కావడంతో స్థలాలకు డిమాండ్ ఏర్పడింది. పార్వతీపురం మండలం నర్సిపురంలో నివాస స్థలం గజం రూ.5 వేల నుంచి రూ.6 వేలకు, వ్యవసాయ భూమి ఎకరా రూ.32 లక్షల నుంచి రూ.37 లక్షల వరకు పెరగనుంది. వెంకంపేటలో నివాస స్థలం గజం రూ.5 వేల నుంచి రూ.6 వేలకు వ్యవసాయ భూమి ఎకరా రూ.30 లక్షల నుంచి రూ.37 లక్షల వరకు పెరగనుంది. అడ్డాపుశీల గ్రామంలో స్థలం రూ.2,500 నుంచి రూ.3,500కు.. వ్యవసాయ భూమి రూ.13 లక్షల నుంచి రూ.18 లక్షల వరకు పెంచుతూ ప్రతిపాదనలు వెళ్లినట్లు తెలిసింది.
- కొమరాడ మండల పరిధిలోని విక్రంపురం గ్రామంలో స్థలం గజం రూ.1,500 నుంచి రూ.2 వేలు, తోట ఎకరా రూ.13 లక్షల నుంచి రూ.16 లక్షల వరకు, వ్యవసాయం భూమి ఎకరా (పల్లం , మెట్టు) రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు పెరగనుంది. ఆర్తాం గ్రామంలో గజం స్థలం రూ.1,200 నుంచి రూ.1,600, వ్యవసాయ భూమి మెట్టు రూ.6 లక్షలు నుంచి రూ.8 లక్షలు.. పల్లం, తోట ఎకరా రూ.7 లక్షల నుంచి రూ.9 లక్షల వరకు పెరగనుంది. కొమరాడ మండలంలో స్థలం గజం రూ.1,200 నుంచి రూ.1,600.. మెట్టు ఎకరా రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షలు.. పల్లం, తోట ఎకరా రూ.7 లక్షల నుంచి రూ.9 లక్షల వరకు పెరగనుంది.
- గరుగుబిల్లి మండలం ఉల్లిభద్రలో స్థలం గజం రూ.1,200 నుంచి రూ.1,800, మెట్టు (ఎకరా) రూ.10 లక్షల నుంచి రూ.13 లక్షలు, పల్లం, తోట రూ.11 లక్షల నుంచి రూ.14 లక్షలకు పెరగనుంది. గరుగుబిల్లిలో స్థలం(గజం) రూ.1,000 నుంచి రూ.1,500.. వ్యవసాయ భూమి(ఎకరా) రూ.8 లక్షల నుంచి రూ.11 లక్షలు.. సుంకి గ్రామంలో స్థలం రూ.1,200 నుంచి రూ.1,500.. మెట్టు రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షలు.. పల్లం, తోట రూ.7 లక్షల నుంచి రూ.9 లక్షల వరకు కానుంది.
- పాలకొండ పట్టణంలో ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరల కంటే 30 శాతం వరకు పెంచే అవకాశాలున్నాయి. మండలంలో 30 నుంచి 40 శాతం వరకు అదనంగా భారం పడనుంది. ఇది కూడా ఆయా ప్రాంతాల్లో మార్కెట్ ధరకు అనుగుణంగా మార్పులు ఉండనున్నాయి. అంపిలి గ్రామంలో 31 శాతం, అన్నవరంలో 39 శాతం, అద్దలి 31 శాతం, కొండాపురం 40 శాతం, ఓని గ్రామంలో 31 శాతం మేర పెంపు జరగనుంది. ప్రస్తుతం ఈ కార్యాలయం పరిధిలో 60 వరకు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

పంటలకు వర్షం దెబ్బ

సాక్షి, పార్వతీపురం మన్యం: తుపాను ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి బుధవారం సాయంత్రం వరకు జిల్లా వ్యాప్తంగా ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో వరి, అపరాలు పంటలతో పాటు కూరగాయలు పండించే రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పక్వానికి వచ్చిన వరి చేలను కోయక తప్పని పరిస్థితి. దాదాపు ఎనిమిది రోజులుగా జిల్లాలో వర్ష ప్రభావం ఉంది. ఫలితంగా ఓవు, కుప్పలు వేసిన చేలలో నుంచి తడిచిన ధాన్యం మొలకలు వస్తున్నాయి. పాలకొండ, సాలూరు తదితర ప్రాంతాల్లో ధాన్యం రంగు మారుతోంది. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు వరి రైతు పెట్టుబడి పెట్టాడు. మొలక, రంగు మారిన పరిస్థితులు ఉంటే.. ధాన్యం లోడు దించేందుకు మిల్లర్లు నిరాకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు అపరాలు, పత్తి, కూరగాయల పంటలకూ తీవ్ర నష్టం ఏర్పడుతోంది. కొమరాడ పరిసర ప్రాంతాల్లో టమాట పంట నేలకొరుగుతోంది. కుమ్మరగుంట, కంబవలస, కల్లికోట, దుగ్గి, గుణానపురం, కొమరాడ, గంగిరేగువలస, మాదలింగి, దళ్లిపేట, తొడుము, కొట్టు, కంబవలస ప్రాంతాల్లో టమాటా అధికంగా సాగులో ఉంది. ఎకరాకు సుమారు రూ.40 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో రైతులు పొలాలకు వెళ్లలేక, పండించిన పంటను విక్రయించలేక అవస్థలు పడుతున్నారు. పంట చాలా వరకు దెబ్బతినడంతో ధర పూర్తిగా పతనమవుతోంది. 20 రోజుల కిందట 28 కిలోల ట్రే రూ.1,200 నుంచి రూ.1,400 వరకు ధర పలకగా.. ఇటీవల కురిసిన వర్షాల వల్ల పంట దెబ్బతినడం, మార్కెట్ లేకపోవడంతో 25 కిలోలు రూ.150 నుంచి రూ.200కు కూడా అమ్ముకోలేని పరిస్థితి ఉందని కూరగాయలు పండించిన రైతులు వాపోతున్నారు.



కొమరాడ మండలంలో వర్షం వల్ల దెబ్బతిన్న టమాటా

రోజంతా వాన..

మంగళ, బుధవారాల్లో రోజంతా జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తూనే ఉంది. 24 నుంచి 25వ తేదీ ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా 22.5 మి.మీ. సగటు వర్షపాతం నమోదుకాగా, బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లా వ్యాప్తంగా 35.01 మి.మీ.సగటు వర్షపాతం కురిసింది. అత్యధికంగా పార్వతీపురం మండలంలో 64.02 మి.మీ, గుమ్మలక్ష్మీపురంలో 45.04, మక్కువలో 43.04, బలిజిపేటలో 37.04, సాలూరులో 36.04, పాచిపెంటలో 33.04, భామినిలో 33.02, కొమరాడలో 31.08, జియ్యమ్మవలస, సీతంపేటలలో 30.08 మి.మీ, చొప్పున వర్షం కురిసింది. అత్యల్పంగా పాలకొండలో 12.02 మి.మీ. వర్షపాతం నమోదైంది.

నిర్ణీత కాలవ్యవధిలో గ్రామసభలు నిర్వహించాలి

పార్వతీపురం: నిర్ణీత కాలవ్యవధిలో అన్ని గ్రామ సభలు నిర్వాహించాలని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ఆదేశించారు. సంబంధిత అధికారులతో బుధవారం టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. ఇంతవరకు జిల్లాలో 567 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు. పార్వతీపురం డివిజన్‌లో 244, పాలకొండ డివిజన్‌లో 323 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించినట్టు వెల్లడించారు. సరిహద్దు సమస్యలను మండల సర్వేయర్‌తో పరిష్కరించాలన్నారు.

వరి కుప్పలపై ఏనుగుల దాడి



సుంకిలో ఏనుగులు నష్టపరిచిన వరి కుప్పను చూపిస్తున్న రైతులు

గరుగుబిల్లి: ఓ వైపు తుఫాన్ వర్షాలు పంటను తడిసిముద్దచేస్తుండగా, మరోవైపు గజరాజులు పంటను నాశనం చేస్తుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఆరుగాలం శ్రమించి సాగుచేసిన పంట మట్టిలో కలిసిపోతోందంటూ ఆవేదన చెందుతున్నారు. వారం రోజుల నుంచి సంతోషపురం, సుంకి, మరుపెంట గ్రామాల్లో గజరాజులు సంచరిస్తున్నాయి. మంగళవారం రాత్రి సుంకి గ్రామానికి చెందిన గొల్లు అన్నపూర్ణ, గొల్లు చంద్రమౌళి, గులిపిల్లి కమల తదితర రైతులకు చెందిన పంట పొలంలో వేసిన వరి కుప్పలను చెల్లాచెదురుగా విసిరేశాయి. పైప్‌లైన్‌లను ధ్వంసం చేశాయి. ఏడు ఏనుగుల గుంపు ఎవరిపైన ఎప్పుడు దాడిచేస్తాయోనని రైతులు భయాందోళన చెందుతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి ఏనుగుల తరలింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు పాఠశాలలకు సెలవు



సాక్షి, పార్వతీపురంమన్యం: బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు జోరందుకున్నాయి. రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. గురువారం భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలకు కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ సెలవు ప్రకటించినట్టు డీఈఓ తిరుపతి నాయుడు తెలిపారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, ఎంఈఓలకు ఆదేశాలు జారీ చేశారన్నారు.

పీఈటీపై 'కమ్మ'ని ప్రేమ.. హెచ్‌ఎంపై వేటు!

- సెలవు పరిగణించనందుకు 'పనిష్మెంట్'
- జిల్లా ఉన్నతాధికారినీ తప్పుదోవ పట్టించిన వైనం!

సాక్షి, పార్వతీపురం మన్యం: సాధారణంగా ఒక రోజు సెలవు కావాలంటేనే పై అధికారులకు అర్జీ పెట్టుకుంటాం. ఒక వారం, పది రోజులు కావాలంటే... లెటర్ రాయాలి, అవసరమైతే మెడికల్ సర్టిఫికెట్ పెట్టాలి.. అంతకుమించి ఉన్నతాధికారుల అనుమతి కూడా ఒక్కోసారి తీసుకోవాల్సి ఉంటుంది. మరి, ఏకంగా చెప్పాపెట్టకుండా ఓ ఆరేడు నెలలు డుమ్మా కొట్టేస్తే... పోనీ తిరిగి విధుల్లోకి వచ్చాక కూడా ఎటువంటి సంజాయిషీ ఇవ్వకుండా.. పైగా తనకు జీతం ఎందుకు ఇవ్వరంటూ పై అధికారిని బెదిరిస్తే ఏం చేయాలి? సాధారణంగా ఏ విభాగంలోనైనా తప్పు అనధికారికంగా సెలవు మీద వెళ్లిన ఆ ఉద్యోగిదే అవుతుంది. కానీ, జిల్లా విద్యా శాఖలో మాత్రం.. ఆ ఉద్యోగికి సెలవు కాలంలో జీతం కోసం ప్రతిపాదనలు పంపించని ప్రధానోపాధ్యాయుడిది అయ్యింది. అందుకు ఏకంగా ఆయనకు విధించే దండన ఏమిటో తెలుసా.. విధుల నుంచి సస్పెండ్ చేయడం!. ఈ చర్యను చూసి ఉపాధ్యాయ లోకం విస్మయం చెందుతోంది.

ఇదీ వాస్తవం..

జిల్లాలోని ఓ బాలికోన్నత పాఠశాలలో పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు గత ఏడాది సెప్టెంబర్ 4 నుంచి ఈ ఏడాది జూలై 23వ తేదీ వరకూ విధులకు హాజరు కాలేదు. దీనివల్ల ఆ పాఠశాల పిల్లలు ఆటలు, వ్యాయామానికి దూరమయ్యారు. తల్లిదండ్రుల నుంచీ ఫిర్యాదులు అందాయి. దాదాపు 9 నెలలు సదరు పీఈటీ విధులకు గైర్హాజరు అయినట్లు పలుమార్లు సంబంధిత హెచ్‌ఎం విద్యాశాఖ అధికారుల దృష్టిలో పెట్టారు. అయినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆ తర్వాత విధుల్లోకి వచ్చిన పీఈటీని తిరిగి కొనసాగించేందుకు హెచ్‌ఎం నిరాకరించారు. దీంతో సదరు ఉద్యోగి అప్పటి డీఈవో ద్వారా మంతనాలు జరిపి, ఆన్ డ్యూటీ కింద సెలవు కాలాన్ని వేయాలని.. మొత్తం జీతం బిల్లులు పెట్టాలని హెచ్‌ఎం మీద ఒత్తిడి తెచ్చారు. సమ్మర్ క్యాంప్ అని కొన్నాళ్లు, తర్వాత స్కూల్ గేమ్స్‌లో పాల్గొన్నారని ఇంకొన్నాళ్లు.. ఆడుదాం ఆంధ్రా పోటీలు అంటూ ఇంకొద్ది రోజులు అడ్జస్ట్ చేయాలని సూచించారు. అందులో ఏ ఒక్క దాంట్లోనూ ఆయన భాగస్వామ్యం లేదని.. తనకు ముందస్తు సమాచారం కూడా ఇవ్వలేదని, తప్పుడు బిల్లులు పెట్టలేనని హెచ్‌ఎం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. చివరికి సదరు పీఈటీకి పై స్థాయిలో ఉన్న 'కమ్మ'నైన పరిచయాలతో ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి తీసుకొచ్చారు. జిల్లా ఉన్నతాధికారిని సైతం ఈ విషయంలో పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్వయంగా జిల్లా విద్యాశాఖాధికారులే వాస్తవాన్ని ఉన్నతాధికారి వద్ద వక్రీకరించారన్న విమర్శలున్నాయి. నిబంధనల ప్రకారమే తాను వెళ్తానని ఆ ప్రధానోపాధ్యాయుడు స్పష్టం చేయడంతో.. అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారంటూ... చివరికి ఆ హెచ్‌ఎం మీదే చర్యలు తీసుకున్నారు. ఆయనను సస్పెండ్ చేస్తూ.. ఆర్జేడీ నుంచి ఆదేశాలు అందాయి. పని చేయని కాలానికి జీతం బిల్లు పెట్టాలని తనపై ఒత్తిడి చేస్తున్నారని.. ఆన్ డ్యూటీ సర్టిఫికెట్ కూడా ముందుగా ఇవ్వలేదని సదరు హెచ్‌ఎం చెబుతున్నారు. కనీసం ఏ నెలలోనూ తనకు డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వకుండా, ఒకే సారి మొత్తంగా ఇచ్చేయమంటే తాను ఏం చేయగలనని వాపోతున్నారు. పిల్లలు తప్పుదోవ పట్టకుండా విద్యాబుద్ధులు నేర్పే గురువుతోనే తప్పుడు బిల్లులు పెట్టమని ఒత్తిడితేవడంపై ఆయన మనస్తాపం చెందుతున్నారు. హెచ్‌ఎంపై వేటు వేశారన్న విషయాన్ని తెలుసుకున్న ఉపాధ్యాయలోకం భగ్గుమంటోంది. వాస్తవం తెలుసుకోకుండా చర్యలకు సిద్ధపడిన ఉన్నతాధికారులను ప్రశ్నిస్తోంది.

విద్యుత్ చార్జీల పెంపుపై.. వైఎస్సార్‌సీపీ పోరుబాట

- ఈనెల 27న నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ర్యాలీలు
- పార్టీ నాయకులతో పాటు అభిమానులు, ప్రజలు తరలిరావాలి
- పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు



చినమేరంగిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో విద్యుత్ పోరుబాట పోస్టర్‌ను విడుదల చేస్తున్న పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

జియ్యమ్మవలస: టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల బాదుడుకు నిరసనగా వైఎస్సార్‌సీపీ ఈ నెల 27న పోరుబాట సాగిస్తుందని పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అన్నారు. ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో భారీ నిరసన ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. ఇందులో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ పోరుబాట పోస్టర్లను చినమేరంగిలో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలపై భారం మోపేందుకు కుట్రలు పన్నుతోందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలపై విద్యుత్, భూ రిజిస్ట్రేషన్ చార్జీలు, యూజర్ చార్జీల పేరుతో బాదుడుకు పూనుకుందన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో ప్రజలపై రూ.15వేల కోట్లు విద్యుత్ చార్జీల భారం వేయడం శోచనీయమన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న దగాకోరు పాలనపై ప్రజలంతా తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు లోలుగు నారాయణరావు, కోట రమేష్, అల్లు ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

'చిల్లర' కనుమరుగు..!

ప్రస్తుతం 70 ఏళ్ల వయస్సు ఉన్న వారికి పరక, అణ, బేడ, కానీల మనుగడ తెలుసు. అణా అంటే ఆరుపైసలు. బేడ అంటే 12 పైసలు లెక్క పెట్టేవారు. ఏవైనా వస్తువులు కొనుగోలు చేసేందుకు షావుకారు వద్దకు వెళ్తే పరక, అణ, బేడ అని వస్తువుల ధరలు చెప్పేవారు. ఆ ప్రకారం చిల్లర నాణాలను వారికి ఇచ్చి వస్తువులను కొనుగోలుచేసేవారు. ప్రస్తుతం 45 ఏళ్ల వయస్సు వారికి ఐదు, పది, 20 పైసలు, పావలా, అర్ధరూపాయి కాయిన్‌ల చలామణి తెలుసు. రూపాయి చిల్లర మార్చితే చేతినిండా కాయిన్‌లు వచ్చేవి. ఇప్పటి వారికి ఆ పైసలు సంగతే తెలియదు. డిజిటల్ యుగం వచ్చాక ఆన్‌లైన్ చెల్లింపులతో చిల్లర సమస్య లేకుండా పోతోంది. 'చిల్లర' వ్యవహారాలు క్రమేపీ తగ్గిపోతున్నాయి. – బలిజిపేట



క్లుప్తంగా

ఏనుగుల విధ్వంసం



ఏనుగులు తినివేసి పాడుచేసిన వరిచేనును చూపిస్తున్న బాధిత రైతు చంద్రభూషణ

భామిని:మండల కేంద్రానికి చెందిన రైతు పోతల చంద్రభూషణ్ నిల్వ చేసిన వరిచేను కుప్పను ఏనుగుల గుంపు మంగళవారం రాత్రి తినివేసి ధ్వంసం చేశాయి. దీంతో రెండు ఎకరాల్లోని సుమారు రూ.80వేల విలువైన వరిపంట పాడైందని బాధిత రైతు వాపోతున్నాడు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరుతున్నాడు.

కన్యకాపరమేశ్వరికి వెండి సింహాసనం



వెండి సింహాసనంలో అమ్మవారిని ఆసీనులను చేసి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం టౌన్: పట్టణంలో కొలువైన కన్యకాపరమేశ్వరి అమ్మవారికి వెండి సింహాసనాన్ని ప్రముఖ వ్యాపారవేత్త కీర్తిశేషుడు నారాయణం విశ్వనాథం కుటుంబసభ్యులు బుధవారం మార్గశిర మాసం దశమి సందర్భంగా సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వెండి సింహాసనంలో ఆసీనులును చేసి వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఏ.నారాయణం వెంకటరమణమూర్తి, వెంకట చలమాజీ, కామేశ్వరరావు, ఈశ్వర్‌కుమార్, శేఖర్, ఏడుకొండలు, రాంజీ, అనంతపల్లి కృష్ణారావు, గణపతిరావు, పాలకమండలి సభ్యులు కుమ్మరిగుంట శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయపోటీల్లో రాణించిన గురుకుల పాఠశాల విద్యార్థి



బ్రాంజ్ మెడల్ సాధించిన నితిన్‌సాయి మనోహర్

సాలూరు: పట్టణ పరిధిలోని పీఎస్ బొడ్డవలసలో గల డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయి పోటీల్లో రాణించినట్లు ప్రిన్సిపాల్ ఆశీర్వాదం బుధవారం తెలిపారు. ఈ నెల 19 నుంచి 24 వరకు జమ్ముకశ్మీర్‌లో జరిగిన జాతీయస్థాయి సబ్ జూనియర్ క్రీడాపోటీల్లో సాఫ్ట్‌బాల్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ఆడిన జట్టులో పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నితిన్ సాయి మనోహర్ బ్రాంజ్ మెడల్ సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ విద్యాసాగర్, పీఈటీ నాయుడులు అభినందించారు.

నేడు అండర్-17 ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-17 బాల, బాలికల ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక ఈనెల 26న నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధి డీవీ చారిప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి నగర శివారుల్లో గల విజ్జీ స్టేడియంలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో 2008 జనవరి 1 నుంచి 2011 డిసెంబర్ 21వ తేదీ మధ్య జన్మించిన క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28, 29 తేదీల్లో కాకినాడ జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- సీపీఎం నాయకుడు రామారావు

నెల్లిమర్ల: వరి పంట రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పంట పూర్తిగా నాశనమైందన్నారు. ముఖ్యంగా తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలకు వరి పనలకు మొలకలు వచ్చాయని చెప్పారు. ఎకరా వరి పంట సాగుకు రూ. 50 వేలు ఖర్చవ్వగా.. ఒక్క పైసా కూడా చేతికి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹210

టిడ్కో ఇళ్లకు గ్రహణం

- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- పార్వతీపురం, సాలూరులో 95శాతం పనుల పూర్తి
- మిగులు పనులు గాలికొదిలేసిన ప్రభుత్వం
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో పేదలకు దక్కని గృహయోగం



పార్వతీపురంలో నిర్మాణం పూర్తి చేసిన టిడ్కో ఇళ్లు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సాలూరులో నిర్మాణం పూర్తి చేసిన టిడ్కో ఇళ్లు

పార్వతీపురంటౌన్: గత ప్రభుత్వం 95 శాతం నిర్మించిన టిడ్కోఇళ్లకు గ్రహణం పట్టింది. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఇళ్ల పంపిణీ నిలిచిపోయింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపించి సకాలంలో ఇళ్ల నిర్మాణం దాదాపు పూర్తి చేశారు. టిడ్కో గృహ సముదాయాల వద్ద పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ గృహాలను అందించాలని శరవేగంగా పనులు చేపట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కనీసం వాటిని పట్టించుకునే పరిస్థితి లేదు. టిడ్కో ఇళ్లు అందక అద్దె ఇళ్లలోనే అవస్థలు పడుతున్నారు.

సొంతిల్లు లేక అద్దె ఇంటిలో ఉంటున్నాం



20 ఏళ్లుగా అద్దె ఇంటిలో ఉంటున్న నాకు టిడ్కో ఇల్లు దక్కింది. 2017వ సంవత్సరంలో సొంతిల్లు అందుతోందన్న ఆశతో అప్పు చేసి తొలివిడతలో రూ.12,500 వేలు చెల్లించాను, ఇప్పటివరకు ఇల్లు కేటాయించక పోవడంతో ఒక వైపు రుణానికి వడ్డీ, మరో వైపు అద్దె చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు.

– కె.స్వామి, లబ్ధిదారు, పార్వతీపురం

కూటమి ప్రభుత్వం చొరవ చూపడం లేదు



2017లో నాకు టిడ్కో ఇల్లు మంజూరు చేశారు. అప్పుడు రూ.500 చెల్లించాను. కేవలం శంకుస్థాపనకే పరిమితమైంది. టీడీపీ ఇళ్ల నిర్మాణం ప్రారంభించలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇళ్లు పనులు ప్రారంభించి దాదాపు పూర్తి చేశారు. నా పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి 6 నెలలు గడుస్తున్నా మిగులు పనులు ప్రారంభించలేదు.

– పి. మార్కండేయులు, లబ్ధిదారు పార్వతీపురం

పేదల ఇళ్లపై వివక్ష తగదు



నూతన ప్రభుత్వం రావడంతో టిడ్కో ఇళ్ల మిగులు పనులు ప్రారంభించలేదు. గత వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పరిపాలనా కాలంలో దాదాపు పూర్తి చేశాం. లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ పూర్తి చేశాం. జిల్లాలో పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాల్లో 1898 ఇళ్లు నిర్మించాం. పార్వతీపురంలో తాగునీరు, డ్రైనేజీ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. వాటిని పూర్తి చేసేందుకు గత ప్రభుత్వం రూ. 11 కోట్లు విడుదల చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం టిడ్కో ఇళ్లపై వివక్ష చూపడం సరికాదు. మిగులు పనులు పూర్తి చేసి పేదలకు అందజేయాలి

– జమ్మాన ప్రసన్నకుమార్, ఏపీ టిడ్కో మాజీ చైర్మన్

పేదల వద్ద వసూలు

పార్వతీపురం మన్యం జిల్లాలో సాలూరు, పార్వతీపురంలలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి లబ్ధి దారులను గుర్తించి 2017లో వారి వాటాగా రూ.500 కేటగిరిలో 300 చదరపు అడుగులు, రూ.25000 కేటగిరిలో 365 చదరపు అడుగులు, రూ.50వేల కేటగిరిలో 430 చదరపు అడుగుల్లో ఇళ్ల నిర్మాణానికి నిర్ణయించారు. ఈ మేరకు లబ్ధిదారుల నుంచి పార్వతీపురంలో రూ.1.75 కోట్లు, సాలూరులో రూ.1.08 కోట్లు వసూలు చేశారు. పేదల నుంచి డబ్బులు వసూలు చేసిన టీడీపీ ప్రభుత్వం కనీసం పనులు ప్రారంభించలేదు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక్క రూపాయికే..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక్క రూపాయికే పేదలకు ఇల్లు అందించేందుకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా సాలూరు మున్సిపాలిటీ పరిధిలో 1100, పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలో 798 టిడ్కో ఇళ్ల పంపిణీకి చర్యలు చేపట్టారు. ఐదేళ్ల కాలంలో శరవేగంగా పనులు చేపట్టి 95 శాతం పూర్తి చేశారు. మిగులు పనులు పూర్తి చేసేందుకు ఎన్నికల ముందు రూ.11 కోట్లు మంజూరు చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిపివేశారు. గృహ సముదాయాల వద్ద పూర్తిస్థాయిలో మౌలిక వసతులు, ఆహ్లాద వాతావరణం కల్పించేందుకు పార్కులు, తాగునీటి సౌకర్యం పూర్తిస్థాయిలో కల్పించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు టిడ్కో గృహాల ఊసెత్తడం లేదు.

పేదోడి సొంతింటి కల సాకారంలో రాజన్నదొర ముద్ర



గతం ప్రభుత్వం హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడిక రాజన్నదొర (ఫైల్)

సాలూరు: గ్రామాలతో పోలిస్తే పట్టణాల్లో సొంత ఇల్లు అంటే పేద, మధ్య తరగతి కుటుంబాలకు చాలా కష్టమైన పనే. అటువంటి పేదవాడి సొంతింటి కలను సాలూరు పట్టణంలో సాకారం చేసిన అంశంలో మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర చెరగని ముద్ర వేసుకున్నారు. ఓ వైపు టిడ్కో ఇళ్లతో పాటు మరోవైపు నెలిపర్తి , గుమడాం తదితర ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు మంజూరుచేయించి పేదవానికి సొంత గూడుకు తనవంతు ప్రయత్నాన్ని రాజన్నదొర చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నాటి ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర కృషితో ఇళ్లతో పాటు పూర్తి మౌలిక వసతుల కల్పనతో పట్టణంలోని గుమడాం సమీపంలో టిడ్కో ఇళ్ల గృహప్రవేశాలు అంగరంగ వైభవంగా జరిగాయి.

జూనియర్స్ కబడ్డీలో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు





జూనియర్స్ కబడ్డీ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన జిల్లా బాల, బాలికల జట్లు

- ద్వితీయస్థానం సాధించిన బాల, బాలికల జట్లు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన కబడ్డీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరిగిన 50వ అంతర్ జిల్లాల జూనియర్స్ కబడ్డీ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన బాల, బాలికల జట్లు ఉత్తమ ప్రతిభ కనబరిచాయి. మూడు రోజుల పాటు జరిగిన పోటీల్లో ఇరు జట్లు ద్వితీయ స్థానాలు దక్కించుకుని విజయనగరం జిల్లా కీర్తి ప్రతిష్ఠలను చాటి చెప్పాయి.

రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుత క్రీడా ప్రతిభతో రాణించి విజేతలుగా నిలిచిన క్రీడాకారులను జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ఐవీపీ రాజు, అధ్యక్షుడు రంగారావుదొర, కార్యదర్శి కేవీ.ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావు, కోశాధికారి శివకుమార్‌లు అభినందించారు.

సర్వమానవాళికి యేసే రక్షకుడు

- ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు ప్రేమానందం



ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్న ఎఐసిసి జిల్లా అధ్యక్షుడు ప్రేమానందం, తదితరులు

విజయనగరం టౌన్: సర్వమానవాళికి యేసే లోక రక్షకుడని ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి.ప్రేమానందం తెలిపారు. ఈ మేరకు స్థానిక వీటీ అగ్రహారంలో ఉన్న న్యూ టెస్ట్‌మెంట్ చర్చి ఆవరణలో క్రిస్మస్ వేడుకలను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తుప్రేమను ప్రతి ఒక్కరూ పొందాలన్నారు. మన పాపాల నుంచి విముక్తి కల్పించి శాంతిమార్గంలో నడిపించే దేవుడని కొనియాడారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రెవరెండ్ నికొడెమస్ మాట్లాడుతూ దేవుని సువార్తను విశ్వజనీనం చేయాలన్నారు. అనంతరం 36వ డివిజన్ కార్పొరేటర్ బాలి పద్మావతి కేక్ కట్ చేశారు. 47వ వార్డు కార్పొరేటర్ పట్నాన పైడిరాజు క్యాండిల్స్ వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. రెవరెండ్ సుకుమార్ చౌదరి అద్భుతమైన సాక్ష్యాన్ని, దైవసందేశాన్ని అందించారు. ఎన్‌టీసీ చర్చి క్వయర్ టీమ్ ఆలపించిన క్రీస్తు గీతాలాపన ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. ఏంజెల్, చార్లెస్ డాని ప్రేమ్సన్, టి.సారమ్మ, జామి అప్పలనాయుడు, కోరాడ శ్రీరాములు, బి.సంతోష్, బి.రాంబాబు, ఎస్.లక్ష్మి, ఎస్.కాంతారావు, ఎస్.హరీష్, డి.కృష్ణ, జి.శామ్యూల్, ఎన్.ప్రభుకుమార్, అధిక సంఖ్యలో క్రైస్తవులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మక్కువకు ప్రయాణం సాహసమే

- గుండెల్లో గుబులు రేపుతున్న బాగువలస మీదుగా ప్రయాణం
- అధ్వానంగా తయారైన రోడ్డు



సాలూరు-మక్కువ రోడ్డు మధ్యలో గోతుల్లో చేరిన వర్షపు నీరు

సాలూరు: సాలూరు నుంచి బాగువలస మీదుగా మక్కువకు ప్రయాణమంటే ప్రజల గుండెల్లో గుబులు రేగుతుంది. గోతులు, గుంతలతో ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే నరకయాతనగా మారింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మార్గం గుండా ప్రయాణమంటే సాహసమేనని ప్రజలు భావిస్తున్న పరిస్థితి ఏర్పడింది. పెద్దపెద్ద గుంతల్లో దిగిపోయి లారీల వంటి పెద్ద వాహనాలు పాడైపోతుండగా, ద్విచక్రవాహనాలు పొరపాటున ఈ గుంతల్లో దిగుతూ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఈ గోతుల్లో వర్షపునీరు నిండిపోవడంతో గుంతల లోతు అంచనా వేయలేక పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

మక్కువ రోడ్డుకు మోక్షమెప్పుడో ?

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక కృషితో సాలూరు నుంచి మక్కువ వరకు 19.60 కి.మీ రోడ్డు వెడల్పు, పటిష్ట పరిచేందుకు సుమారు రూ.55 కోట్ల 56 లక్షల అంచనా విలువతో ఈ రోడ్డు మంజూరైంది. రూ.38 కోట్ల 52 లక్షల పని విలువతో ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో 2021 మార్చి 1వ తేదీన ఈ రోడ్డు పనులు ప్రారంభించారు. పనుల్లో భాగంగా 6 కి.మీ మెటల్ లేయర్ వేశారు. 32 కల్వర్టులకు గాను 16 కల్వర్టులు, 8 మైనర్ బ్రిడ్జిలకు గాను 3 బ్రిడ్జిల నిర్మాణం పూర్తయింది. మిగిలిన పనులు చేపట్టాల్సి ఉంది.



గజానికో గొయ్యితో దర్శనమిస్తున్న రోడ్డు

రోడ్డు నిర్మాణం పూర్తిచేయరా?

ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి ఈ రోడ్డునిర్మాణం పూర్తి చేయించి తమ రహదారి కష్టాలు తీర్చాలని సాలూరు,మక్కువ మండలాల ప్రజలు కోరుతున్నారు.ఇటీవల ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ మార్గం గుండా కాకుండా సాలూరు నుంచి మామిడిపల్లి, శంబర మీదుగా మక్కువకు ప్రయాణించిన విషయం పాఠకులకు విదితమే.

ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు జిల్లా క్రీడాకారులు



ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు అర్హత సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న ఆలిండియా యూనివర్సిటీ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారులు అర్హత సాధించారు. ఇటీవల విశాఖలోని ఆంధ్రాయూనివర్సిటీలో జరిగిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురు క్రీడాకారులు ఈనెల 26 నుంచి ఒడిశా రాష్ట్రంలో జరగబోయే ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యారు. విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన పి.వసంత 100, 200 మీటర్ల పరుగు పోటీలో అర్హత సాధించగా..సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న ఎం.హరీష్ 5000 మీటర్లు, 10000 మీటర్ల పరుగు పోటీలో, విజయనగరం ఎంఆర్ కళాశాలలో చదువుతున్న ఎస్.శ్రావణి 200మీటర్లు, 400 మీటర్ల పరుగు పోటీలో, శ్రీనివాస కళాశాలలో చదువుతున్న వి.భార్గవి 100 మీటర్ల పరుగు పోటీలో అర్హత సాధించినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధి లీలాకృష్ణ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు బుధవారం పయనం కాగా..వారిని అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు. ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పతకాలు సాధించి విజయనగరం ఖ్యాతిని చాటి చెప్పాలని ప్రోత్సహించారు.

నారాయణ..నారాయణ..!

- ఉనికి కోల్పోతున్న ఆనకట్ట
- ఊడిపోయిన తలుపులు
- శిథిలావస్థకు చేరిన సాగునీటి వనరు



షట్టర్లు నిలిపేందుకు అడ్డంగా పెట్టిన రాయి

సంతకవిటి: మండలంలో 18,807 ఎకరాల్లో వ్యవసాయానికి ఆధారంగా ఉన్న ప్రధానమైన సాగునీటి వనరు నారాయణపురం ఆనకట్ట. దశాబ్దాల క్రితం నిర్మించిన ఆనకట్ట ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. ఆనకట్ట కుడి, ఎడమ ప్రధాన కాలువలు ద్వారా కొన్ని వేల ఆయకట్టు ఉంది. నారాయణపురం ఆనకట్టలో షట్టర్ల వ్యవస్థ కీలకం. మొత్తం 118 షట్టర్లు ఉండగా వాటిలో అధికశాతం షట్టర్లు పాడైపోవడంతో రాళ్లను ఆధారంగా పెట్టి తలుపులు నిలబెట్టారు. దీంతో ఆనకట్టలో నీరు నిలవడం గగనంగా ఉంది. కొన్ని షట్టర్లు పూర్తిగా లేకపోవడం కొసమెరుపు. 50.50 కిలోమీటర్ల పొడవున్న కుడి ప్రధాన కాలువ ద్వారా సంతకవిటి, పొందూరు, ఎచ్చెర్ల మండలాలకు సాగునీరు అందాల్సి ఉండగా ఆనకట్టలో పూర్తిస్థాయిలో నీరు నిలవక పోవడం, కాలువల పరిస్థితి బాగా లేక పోవడంతో శివారు ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో నీరు అందడం మృగ్యంగా ఉంది. దీంతో ప్రతి ఏటా పంటను కోల్పోవలసి వస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.




నారాయణపురం ఆనకట్ట

గట్టు కొట్టేసే ప్రమాదం ఉన్నా..

సంతకవిటి మండలంలోని రంగారాయపురం, వాసుదేవపట్నం గ్రామాల మధ్య ఆనకట్టకు కూతవేటు దూరంలో కాలువకు గండి పడే ప్రమాదం ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులే స్వయంగా ఇసుక బస్తాలతో కొంతమేర గట్టును పటిష్ట పరుచుకుని వారి పంటలను కాపాడుకున్నారు.

జైకా నిధులు మంజూరైనా..సాగని పనులు

నారాయణపురం ఆనకట్ట ఆధునికీకరణకు రూ.112.10 కోట్లు మంజూరైనా ఇప్పటి వరకు 25శాతం పనులు మాత్రమే చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ మొత్తం నిధుల్లో దాదాపు రూ.2.5 కోట్లు షట్టర్లు మార్చడానికి, ఆనకట్టలో కాంక్రీట్ పనులకు మంజూరవగా ఇప్పటివరకు కనీసం పని జరగకపోవడం విశేషం. 118 షట్టర్ల స్థానంలో 108 షట్టర్లు ఏర్పాటు కావాల్సి ఉంది. కొంతమేర కాలువలో లైనింగ్ పనులు మాత్రమే చేపట్టినట్లు అధికారులు తెలిపారు.



పాడైపోయిన కుడి ప్రధాన కాలువలోకి నీటిని మలిచే రెగ్యులేటర్



రైతులు ఇసుక బస్తాలతో గట్టును కప్పిన ప్రదేశం

నోటీసులు అందించాం

జైకా నిధుల ద్వారా పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్‌కు నోటీసులు పంపించాం. పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

–బి.రాంబాబు, ఏఈఈ, కుడి ప్రధాన కాలువ